# నిత్యగోల - నెలగోల

శ్రీ వి. విశ్వనాథమ్

"సౌఖ్యానికీ, సౌభాగ్యానికీ సుందరకాండ నిత్యము పారాయణ చేయకూడదూ" ఇంటి యిల్లాలు పొయ్యి విసురుతూ, కళ్లలో పొగపడకుండా చీర కొంగుతో తుడుచుకొంటు పోరుతోంది.

"రామనామం నిత్యము జపంచేయమన్నాడు గాంధీజీ" అని గొణుగుతూ గడ్డంసామానులు సర్దుకున్నాడు ఇంటి యజమాని మాధవయ్య. "చెప్పినవీ, చదివినవీ చేయడానికి కలకత్తాలో కాలం చాలవద్దూ" మాధవయ్య ధోరణి సాగుతూనే ఉన్నది.

మాధవయ్య కాలకృత్యాలు నెరవేర్చి కొళాయి దగ్గఱకు వెళ్లేసరికి టక్కున ఒక బొట్టూకూడ పడకుండా పోయింది.

"శంభుప్రసాదుగారూ! మీ కొళాయి, కాస్త ఆపుదురూ – టైము అయిపోతున్నది, స్నానం చెయ్యాలి."

"మాదీ అలాగే నసుగు నసుగుతూ ఉంది, మాధవయ్యగారూ!"

మూడో అంతస్తు (Flat)లో ఉన్న మీనన్, అయిదో అంతస్తులో ఉన్న అమర్‌నాథూ కూడా స్నానాన్ని సాయంకాలానికి వాయిదావేసి సూటుసవరించుకొంటూ సవారికెదురు చూస్తూ ఉన్నారు.

కాపరం పెట్టిన ఈ కొద్ది సంవత్సరాలలోను, కాళ్లు అరిగేటట్లు తిరిగి కాళ్లావ్రేళ్లా పడి కావలసిన అద్దెయిచ్చి సంపాదించిన యిళ్లలో ఇది ఆరవది.

కార్పొరేషను పన్నులు జాస్తి వేస్తాందని నెలనెలకు అద్దె పెంచడంతో మొదటి యిల్లు ఖాళీచేయడం అయింది. "అన్నీ ఉన్నాయి ఆయుష్షు తక్కువ" అన్నట్లు అంగుపాట్లు అన్నీ ఉన్నా ఎండా వానల వివక్షత లేక ఇంట జొరపడుటచే ఇల్లు విడువక చేసేదేంగనుక!

సలాములు బ్రోకరేజిలు ఇచ్చికుదుర్చుకొన్న ఈ యిల్లు ఆరవది. ఋణానుబంధం ఎన్నాళ్లో - మాధవయ్యకీ, మీనన్‌కీ, అమరనాథ్‌కూ ఈ యింటితో.

కలకత్తాకి 'క్యూ' పనికిరాదు. క్యూ పద్ధతి కావాలి అన్న జనం అంతా జమకూడి "డబల్ డెకరు" లో దూరంగా ఉన్న ఆఫీసులు చేరుకొన్నారు.

ముంజేతివాచి ముప్పావుగంట ముందు పెట్టుకొని ఉడికీ ఉడకని మెతుకులు ఉదరంలో వేసుకొని విశ్వప్రయత్నంపైన బస్సు ఫుట్ బోర్డు మీద వ్రేళ్లాడుతూ, ఉద్యోగపు వీధి చేరుకొనేసరికి వేళ అయిపోయింది.

మాధవయ్య, ఆఫీసులో అడుగుపెట్టేడో లేదో 'అయిదు నిమిషాలు ఆలస్యమన్నారు. పిచ్చాపాటీ పురాణం అవుతూనే ఉంది, ఆఫీసరు ఆర్డరు అయిందని కబురు.

(137 వ_పేజి చూడుడు)

(114–వ పేజీ తరువాయి)

"ఇటు చూడు ఆ స్టేటుమెంటు అలా వెనకపడుతోంది. అత్యవసరం కదా. ఆలస్యంచేస్తే ఎట్లా? అథారిటీ చలాయిస్తేనే కాని ఆఫీసరు అనిపించుకోడేమో?"

"ఇదుగోనండి, ఈరోజు పూర్తి చేస్తా" చేతులు నలుపుకొంటూ సీటు చేరుకొన్నాడు మాధవయ్య. సాయంత్రంలోగా శతసతాయింపులతో ఆఫీసు గొడవ తెముల్చుకొని ఇంటిముఖం పట్టాడు మాధవయ్య. ఇరకటం ఇల్లూ, ఇల్లాలు ఘోష కళ్లముందు తాండవిస్తూ ఉండడంచేత కాళ్లను కర్జన్ పార్కుకు పోనిచ్చాడు కాస్త అయినా కులాసాగా కాలక్షేపం చేద్దామని. చల్లని పిల్లవాయువులు, సౌందర్యంగా అలంకరించిన రకరకాల పుష్పసముదాయము, ఆనందముగానే ఉన్నది వాతావరణం. ఆఫీసు నుండి అలసిసొలసి ఆతృతతోపోయే జనసముదాయపు కోలాహలము చెవులను రింగుమనిపిస్తోంది. రోడ్డుమీదనుండి రివ్వునవచ్చే ధూళి నాసికారంధ్రాలలో జొరపడుతోంది. ప్రశాంతత లేని పార్కుల ప్రయోజనమేమి, అని పలవరించే ప్రజలు లేకపోలేదు.

సంధ్యారాగములు అల్లుకొన్నవి రంగురంగుల కాంతి దీపములు వింత వెలుగులు వెదజల్లుతున్నాయి. అక్కడక్కడ కార్పొరేషను దీపములు కునికిపోవుటచేత రాత్రి బాగానే అయినట్లు తెలుస్తోంది. రాత్రించరులు రోడ్డుమీద పోతున్నారు. జట పటాలు వేసుకుపోయే జంట పక్షులు.— భార్యాభర్తలు కావచ్చు - లేదా ప్రేమికులు కావచ్చు. కొంత దూరంలో కుతూహలంగా చూచే కములాక్షులు, వాళ్ల ప్రక్కగా రయమునపోయే లెక్కలేని రోమియోలు, రకరకాలుగా రక్తి కలిగించే రేయి మాధవయ్యను కూడ రవంత రేకెత్తించింది అంటే అతిశయోక్తి లేదు. హైహీల్డు (High healed) అమ్మాయి అంతేదో కనుక్కుందామని ఆమె ప్రక్కనే నడుస్తూ, ఆమె అమాంతంగా ఆటోమేటిక్ టెలిఫోను ఆఫీసులో ప్రవేశించేటప్పటికి, మేలుకొని మాడినముఖంతో మరలిపోయాడు మాధవయ్య! యత్నించి యత్నించి ఆరుమైళ్ల దూరంలో ఉన్న ఇల్లు చేరుకొన్నాడు, బస్సులో వ్రేళ్లాడుతూ.

"నాన్నగారూ, పచ్చడిలో ఉప్పు వేసానో లేదో చూడండి!" అం పదేళ్ల పసిబిడ్డ పచ్చడి చేతిలో పెట్టింది

దినపత్రిక చదువుతూ దూరంలో కూర్చున్న 'గృహలక్ష్మిని' చూడగానే దిగాలుమన్నాడు మాధవయ్య.

"నెల ముందు అని తెలిసికూడ ఇంత ఆలస్యంచేస్తే ఎట్లా అండీ చంటిపిల్ల ఏమి చేయగలదు, అంత వంటాను".

ఇది నిత్యగోల కాదన్న మాట - నెల గోల, మూలుగుకొంటూ మాధవయ్య ముందున్న మూడురోజులు మరీ తలచుకొంటూ మొగము వాల్చాడు.